నల్లవాగుకు పెరిగిన వరద

నిండుకుండలా నల్లవాగు ప్రాజెక్టు

సిర్గాపూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: మండలంలోని నల్లవాగు ప్రాజెక్టుకు స్వల్పంగా వరద కొనసాగుతోందని ప్రాజెక్టు సహాయ ఇంజ నీర్ శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులో 642 క్యూసెక్కుల నీరు వస్తుండగా అలుగు ద్వారా 532 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1493 అడుగులు కాగా ప్రస్తుతం 1493.25 అడుగుల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడుమ కాలువల ద్వార 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని శ్రీవర్ధన్‌రెడ్డి వివరించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

సబ్ పోస్టాఫీసులో రైల్వే రిజర్వేషన్లను పునరుద్ధరించాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర మంత్రి పొన్నం లేఖ

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త : హుస్నాబాద్ సబ్-పోస్టాఫీసులోని ఐపిఆర్ఆర్ ఎస్ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేఖ రాశారు సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఎంపిక చేసిన పోస్టాఫీసులు రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లుగా పనిచేస్తున్నాయని తెలిపారు. హుస్నాబాద్ సబ్ పోస్టాఫీసులో గతంలో ఇండియన్ పోస్టల్ రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ సదుపాయాన్ని పోస్టల్‌శాఖ నిలిపివేసిందన్నారు. దీంతో పోస్టాఫీసులో రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడానికి వచ్చే రైతులు, కార్మికులు, విద్యార్థులు,సీనియర్లకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రజలు ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారని లేఖలో పేర్కొన్నారు. సమస్యను కమ్యూనికేషన్ల మంత్రితో పాటు పోస్టల్ అధికారులతో మాట్లాడి హుస్నాబాద్ సబ్ పోస్టాఫీసులోని ఐపిఆర్ఆర్ఎస్ కేంద్రాన్ని త్వరగా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని బండి సంజయ్‌ని లేఖలో కోరారు.

బ్యాంక్ నోటీసులతో నిరసన తెలుపుతున్న మహిళా గ్రూపు సభ్యులు

న్యాయం చేయండి

-లోన్ తీసుకోకుండానే నోటీసులు జారీ

గజ్వేల్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): పట్టణంలో ఆర్‌పిల అవినీతిపై గతంలో జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ, అప్పటి మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య విచారణ చేపట్టి జిల్లాకలెక్టర్‌కు నివేదిక అందించడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మెప్మా అధికారులు రిసోర్స్ పర్సన్‌లను విధులనుండి తొలగిస్తూ సిఒను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద శివశంకర్, నెహ్రూ మహిళా గ్రూపు సభ్యులు నిరసన చేపట్టారు. గతంలో బ్యాంక్ అధికారులు తమ ప్రమేయం లేకుండా రుణాలు మంజూరు చేశారని, మాకు తెలియకుండానే మా ఖాతాల నుండి డబ్బులు డ్రా చేసిన కృష్ణలీల, మంజులలపై అధికారులు అడపా దడపా చర్యలు తీసుకున్నారు. కానీ బ్యాంక్ అధికారులు మాత్రం తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ నోటీసులు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు నెలల నుండి మా గ్రూపులకు సంబంధించిన డబ్బులు కట్టాలని ఆర్‌పిలను పదే పదే అడుగుతుంటే సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ అధికారుల సహకారంతోనే అవినీతి జరిగిందని, ఏ ఒక్క బ్యాంక్ అధికారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు మావి అని, లక్షల రూపాయలు లోన్ తీసుకున్నట్లు బ్యాంక్ అధికారులు చూపిస్తున్నారని, మేము ఏవిధంగా కట్టాలని ప్రశ్నించారు. బ్యాంక్‌లో మా పేరుపై ఉన్న డబ్బులను వెంటనే జమ చేయాలని, లేనిచో ఆత్మహత్య చేసుకుంటామని కరాఖండిగా తెలిపారు. అనంతరం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఆర్‌పిలపై ఫిర్యాదు చేశారు.

ప్రజ్ఞాపూర్ ఊర చెరువు కాలువలపై దృష్టి సారించాలి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కమ్మరి శ్రీనివాస్‌చారి

గజ్వేల్, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊరచెరువు కాలువలు కబ్జాకు గురికావడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు రోడ్లపైకి చేరిందని, గతంలో ఓ నాయకుడు వెంచర్ చేసిన మూలంగానే కాలువలు కబ్జాకు గురైనట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో బిజెపినాయకుడు, టెలికాం బోర్డు సభ్యులు కమ్మరి శ్రీనివాస్‌చారి, బిజెపి పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ చేపట్టి కబ్జాకు గురైన చెరువు కాలువలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : నాగల్‌గిద్ద మండలం, మనూర్ మండలాలలో ఇటీవల కురిసిన అధిక వర్షానికి సింగూర్ బ్యాక్ వాటర్ ద్వారా నీట మునిగిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాహారతికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. మాజీఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ఈ రెండు మండలాలలో సింగూరు బ్యాక్ వాటర్ ద్వారా వరి, పత్తి పెసరు మినుము సోయాబీన్ తదితర పంటలు నీట మునిగాయని దీని ద్వారా ఆ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారని వారికి ప్రభుత్వం తరఫున వెంటనే నష్టపరిహారం అందించేలా చూడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు. నాగల్ గిద్ద మండల పార్టీ అధ్యక్షులు పండరి, మాజీ ఎంపీటీసీ నందు పటేల్, అశోక్ పాటిల్, శంకర్ పటేల్, సోపన్ పటేల్, వెంకట్ రాజ్య, ఉల్లెప్ప మేత్రి, బాలాజీ, నాందేవ్ తదితరులు ఉన్నారు.

సింగూరుకు వరద.. 3 గేట్లు ఎత్తి దిగువకు నీరు

పుల్‌కల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: సింగూరు ప్రాజెక్టుకు ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వరద నీటి ప్రవాహం వస్తుండటంతో సోమవారం 8,9,10 నంబర్ క్రస్ట్‌గేట్లు మీటరున్నర ఎత్తు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 24284 క్యూసెక్కులు వస్తుండగా ఔట్ ఫ్లో 24777 క్యూసెక్కులుగా నమోదయింది. మూడు క్రస్ట్ గేట్ల ద్వార 21840 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్‌తో 2272 క్యూసెక్కులు, ఎడమకాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎం డబ్ల్యుఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కు లు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్ ఫ్లో 24777 క్యూసెక్కులుగా నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 520,795 మీటర్లకు 17.544 టీఎంసిల నీటి నల్వలు ఉన్నాయని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

సింగూరు ప్రాజెక్టు

విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: రెండు, మూడు రోజుల నుంచి జిల్లాలో అధికంగా వర్షాలు కురిసినందున డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా జిల్లావ్యాప్తంగా గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బంధీగా నిర్వహించేలా పర్యవేక్షించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికంగా వర్షాలు కురవడంతో నేల చిత్తడిగా మారి నీరు నిలవ ఉండడం మూలంగా దోమలువృద్ధిచెంది డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపింపచేసే అవకాశం ఉన్నందున్న జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బంధీగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలలో పారిశుధ్య పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛతాహే సేవా 2025 కార్యక్రమం ద్వారా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల సహకారంతో శ్రమదానం, పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్యను ఆదేశించారు. అనంతరం స్వచ్ఛతాహే సేవ 2025 కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణీ కార్యక్రమానికి వచ్చి అందజేసిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. 152 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమాఅగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపున్న సందబోయిన ఎల్లయ్య, అంగన్‌వాడీ టీచర్లు

ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీవిద్యను

అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, సెప్టెంబరు 15(ప్రభాతవార్త): రాష్ట్రప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా తీసుకువచ్చిన ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో ఆర్డీవో కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను బ్రతికించాలని, అంగన్వాడీ పొట్టకొట్టే విధానాలు మానుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రీ ప్రైమరీ, పిఎం శ్రీవిద్య పేరుతో ఐదు సంవత్సరాలలో పిల్లలను విద్యా శాఖకు అప్పగించడం ద్వారా అంగన్‌వాడీ వ్యవస్థ నిర్వీర్యమవుతుందన్నారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు కనీస వేతనం 18వేలు, ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ జీవో 8 సవరణ చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. 24 రోజుల సమయం వేతనం ఇవ్వాలని, మూడు నెలల పిఆర్‌సి, మినీ సెంటర్లకు 11 నెలల ఏరియల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీనియారిటీ ప్రకారం ఇంక్రిమెంట్ అమలుచేయాలని, ఐసిడిఎస్ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న జరిగే ఛలో హైద్రాబాద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రంగారెడ్డి, యూనియన్ నాయకులు అంజలి, నాగరాణి, స్వాతి, దివ్య, పద్మ, మీరాబాయి, వినోద, సువర్ణ, నాగరాణి, ఉమాదేవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

'యాత్రా దానం' అమలుకు చర్యలు

-గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పావన్

గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలో యాత్రాదానం పేరిట నూతన కార్యక్రమం అమలుకు చర్యలు తీసుకోనున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ పావన్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ యాత్రాదానం కొత్త సామాజిక సేవా కార్యక్రమం బాధ్యతలో భాగంగా ఆర్టీసీ ఎండి సజ్జనార్ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో, గురుకులాలలో చదివే పేద విద్యార్థులకు విజ్ఞాన విహార యాత్రలు, పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనే కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితుల కారణంగా వారికి సాధ్యపడటంలేదన్నారు. ఇలాంటి వారి సౌకర్యార్థం ఆర్టీసీ యాత్రాదానం కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో నుండి విజ్ఞాన విహారయాత్రలకు, దైవదర్శన యాత్రలకు బస్సులను యాత్రదానం చేసే అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రజలు, కార్పోరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐలు, ఎన్‌జివోస్ తదితరులు ఎవరైనా వారి పుట్టినరోజులు, పెళ్లిరోజులు, పండుగలు, ఇతర శుభదినాలలో వృద్ధులను, అనాథలను, దివ్యాంగులను, నిరుపేద విద్యార్థులను దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలకు, విజ్ఞాన విహారయాత్రలకు తీసుకెళ్లడానికి ఆర్టీసీకి డబ్బులను విరాళంగా అందజేస్తే వారికి బస్సు యాత్ర సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. సేవా సంస్థలు, సామాజిక సేవ పరులు ముందుకువచ్చి పెద్దసంఖ్యలో యాత్ర దానం చేయాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ లేదా కార్యాలయంలో లేదా 9959226270, 9347252659, 7386367677 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సరాఫ్‌పల్లి పంచాయతీని డిపివో తనిఖీ

చౌటకూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని సరాఫ్‌పల్లి గ్రామంలోని పంచాయితీ కార్యాలయాన్ని సోమవారం జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా తనిఖీ చేశారు. గ్రామంలో పన్నుల వసూళ్లు, రికార్డుల నిర్వాహణను డిపిఓ పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ, వీధి దీపాలు తదితరాలపై పంచాయితీ కార్యదర్శి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని వీధులన్ని పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, తమ ఇంటి పరిసారలను పరిశుభ్రంగా ఉంచుకునే గ్రామస్థులకు అవగాహన కల్పించాలని పంచాయితీ కార్యదర్శికి సూచించారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. గ్రామంలోని డంపింగ్ యార్డును, వైకుంఠ ధామాన్ని సందర్శించారు.

పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డిపిఓ సాయిబాబా

వన దుర్గమ్మ ఆలయం ముందు నుండి ప్రవహిస్తున్న నీరు

ఏడుపాయల్లో కొనసాగుతున్న వరద

పాపన్నపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : ఏడుపాయల్లో మంజీర వరదలు కొనసాగుతున్నాయి. సోమవారం సింగూరు నుండి 24,777 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు.దీంతో ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతు, దుర్గమ్మ ఆలయాన్ని చుట్టముట్టి వరదలు ముందుకు సాగుతున్నాయి. భక్తులు రాజగోపురంలో గల అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్నారు. వరదల వైపు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

బాధితులను పరామర్శించిన ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : అగ్నిమాపక కేంద్రం సమీపంలో జరిగిన విద్యుత్‌షాక్‌తో గాయాలైన కాంట్రాక్ట్ కార్మికులు అనిల్, సంతోష్‌లను కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. సోమవారం నర్సాపూర్‌లోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా సిబ్బందికి షాక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సహచరులు వారిని నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ సంఘటన విషయం తెలుసుకున్న ఆవుల రాజిరెడ్డి తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి గాయపడిన విద్యుత్ సిబ్బందిని పరామర్శించారు. బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా సంబంధిత ఉన్నతాధికారులు,వైద్యులతో ఆయన మాట్లాడారు. అవసరమైతే ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన వికలాంగులు

వెల్దుర్తి సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు మరియు చేయూత పెన్షన్లు తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగులు స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ఆదేశాలను సారం సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముట్టడించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ పెంచాలని అలాగే వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు చేనేత బీడీ కార్మికులకు 4000 రూపాయలు తక్షణమే పెంచాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నూతన పెన్షన్ మంజూరు చేయాలని వికలాంగులకు రాజకీయాల్లో భాగ్యస్వామ్యం కల్పించాలని అన్నారు. నిరుపేద అనాథ ప్రజల కొరకు పెన్షన్లు ప్రవేశపెట్టాలని పెన్షన్ల కోసం రాష్ట్రంలో ఉన్న ఏ ప్రతిపక్షం ప్రభుత్వాన్ని ప్రశ్నిక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్ముచేకులు జాజాల కృష్ణ మాదిగ తో పాటు వికలాంగులు ఎల్లమ్మ స్వామి సిద్ధమ్మ కిష్టయ్య శ్రీనివాస్ కిషన్ ఆగమ్మ బాలమణి పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ తాహేరా బేగం మృతి

-నివాళులర్పించిన మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: పట్టణంలోని 2వ వార్డు పాండురంగ మహేలాకు చెందిన కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ తాహేరా బేగం సోమవారం అకాల మృతి చెందారు. తాహేరా బేగం వార్డు నుంచి 3 మార్లు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. తాహేరాబేగం మృతి చెందినట్లు తెలుసుకున్న మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ తాహేరా బేగం నివాసానికి చేరుకుని భౌతిక కాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాహేరా బేగంకు నివాళులు అర్పించిన వారిలో మాజీ టిఎస్ ఐడిసి చైర్మన్ మహ్మద్ తన్వీర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎస్ ఉజ్వల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, హనుమంతరావు పాటిల్, మక్సుద్, మాజీ వైస్ చైర్మన్ ఎండి ఖాజామియా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పాపన్నపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండలం యూసఫ్‌పేటలో సోమవారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కుర్మ శేఖర్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సోమవారం ఉదయం వ్యవసాయ క్షేత్రంలో పంటకు బోరు బావి ద్వారా నీరు అందివ్వడానికి ఉదయం వ్యవసాయ క్షేత్రానికి విద్యుత్ సరఫరా ఇస్తారని పంట సాగుకు బోరుబావితో నీరు అందివ్వడానికి వెళ్లగా వ్యవసాయ క్షేత్రానికి వచ్చే 11కెవి విద్యుత్ వైరు కిందపడి ఉండడం గమనించని మృతుడు విద్యుత్ వైరు తగిలడంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందగా. ఇది గమనించిన స్థానికులు వెంటనే పాపన్న పేట పోలీసులు,కుటుంబీకులకు తెలుపడంతో సమాచారం అందుకున్న పాపన్న పేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య యశోద, ఇరువు కుమారులు ఉన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్

ఇద్దరికీ తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం

నర్సాపూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : విద్యుత్ వైర్లు మరమ్మతులు చేస్తుండగా ఇద్దరి కార్మికులకు షాక్ తగిలి తీవ్ర గాయాలైన సంఘటన నర్సాపూర్ లోని ప్రధాన రహదారిపైగల అగ్నిమాపక కేంద్రం వద్ద చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలు పలువురి కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నర్సాపూర్‌లో అగ్నిమాపక కేంద్రానికి విద్యుత్ సరఫరా కోసం నూతన విద్యుత్ వైర్లను అమరుస్తున్న క్రమంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు కౌడిపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన అనిల్, కౌడిపల్లికి చెందిన సంతోష్ హైటెన్షన్ వైర్ల కింద మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో అనిల్ విద్యుత్ వైర్లపైనే వేలాడుతూ కింద పడిపోయాడు. మరో కార్మికుడు సంతోష్ ప్రక్కనే ఉన్నా రేకుల షెడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా అక్కడే ఉన్న కాంట్రాక్టర్ స్వామితోపాటు పలువురు గమనించి హుటాహుటిన 108కు సమాచారం ఇవ్వగా తీవ్ర గాయాలైన వారిద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించారు ఈ విషయమై నర్సాపూర్ విద్యుత్ ఏఈని వివరణ కోరగా పొంతన లేని సమాధానం ఇస్తూ నిరక్ష్యంగా మాట్లాడారు.. ఈ విద్యుత్ షాక్ కుగురై తీవ్రగాయాలైన అనిల్, సంతోష్‌లకు చికిత్సలు నిర్వహిస్తున్నారు.

షాక్ తగిలి విద్యుత్ స్థంబంపై వేలాడుతున్న కార్మికుడు, షాక్ తగిలి రేకులషెడ్డుపై పని సంతోష్‌ను కిందకు తెస్తున్న సహచరులు

యూరియా అక్రమ సరఫరాపై ఉన్నతాధికారుల నజర్...!?

యూరియా పక్కదారి పట్టడానికి సహకరించిన అధికారులపై విచారణకు సిద్ధం.. ఎడిఎ, ఎవోల ఆధ్వర్యంలో విచారణ చేసే అవకాశం

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కొద్ది రోజులుగా రైతులకు నేరుగా అందాల్సిన యూరియా పక్కదారిపడుతూ బ్లాక్ మార్కెట్‌కు తరలుతుంది అని తీవ్ర ఆరోపనలు రావడంతో సోమవారం ఈ విషయంపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి హుస్నాబాద్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లయ్యకు విచారణ నిమిత్తం ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పంట సాగు చేసిన వివరాలు, వేసే ఎరువులు, యూరియా ఎంత మేరకు వాడుతున్నారు? పంటలకు వేసిన యూరియా ఎక్కడ తీసుకున్నారు? వారికి సంబంధించిన పర్మిట్‌లతో పాటు టోకెన్లను పరిశీలించాలని మండల వ్యవసాయశాఖ అధికారులకు సూచించినట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది. అయితే ఈ వ్యవహారంలో ఏఈవోలు ఒక్కో యూరియా బస్తాకు దళారుల వద్ద మామూళ్లు తీసుకున్నారనే

మేధా పాఠశాల విద్యార్థులను మరో పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు

బోయిన్‌పల్లి మేధా పాఠశాలను సందర్శించిన విద్యా శాఖ అధికారులు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మేధా స్కూల్‌లో డ్రగ్స్‌తయారీలో తీవ్ర కళకలం రేపిన విషయం తెలిసింది. సోమవారం విద్యా శాఖ అధికారులు మత్తు పధార్థాల తయారీ కేసులో సీజ్ అయినా మేధా పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో చదువుతున్న 63 మంది విద్యార్థుల భవిష్యత్తు మధ్యలో ఆగిపోకుండా ఇతర స్కూళ్లలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బాలనగర్ మండల విద్యా శాఖ అధికారి హరిశ్చంద్ర తెలిపారు. మేధా పాఠశాలకు 7వ తరగతి వరకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పాఠశాల యాజమాన్యం అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల చదువుల విషయంలో ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా ఇతర పాఠశాలలో చేర్పిస్తామని విద్యా శాఖ అధికారులు భరోసా ఇచ్చారు.

విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందనతో తప్పిన ప్రమాదం

చెట్టు కొమ్మలు దగ్గర ఉండి కొట్టిస్తున్న ధర్మసమాజ్ ముషీరాబాద్ కన్వీనర్ గూడపర్తి సంతోష్‌కుమార్

ముషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: విద్యుత్ శాఖ సిబ్బంది సమయానికి స్పందించటంతో ముషీరాబాద్ నియోజకవర్గం, కవాడిగూడలో పెను ప్రమాదం తప్పిందని ధర్మసమాజ్ పార్టీ ముషీరాబాద్ కన్వీనర్ గూడపర్తి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కవాడిగూడ భాగ్యలక్ష్మినగర్ కాలనీలో హైటెన్షన్ వైర్లు చెట్ల కొమ్మలకు తగిలి మంటలు చెలరేగి, వైర్లు తెగి రోడ్డుపై పడిపోయాయి. ఇది గమనించిన స్థానికులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేయటంతో తక్షణమే స్పందించిన విద్యుత్ అధికారులు ఎమర్జెన్సీ టీమ్‌తో కలసి విద్యుత్ సరఫరా నిలిపివేసి, చెట్ల కొమ్మలు కొట్టించి, వైర్లను పునరుద్ధరించారు. రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు కష్టపడి పనిచేసి, ఎవరికీ ఎటువంటి హాని జరగకుండా చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ సిబ్బందికి ధర్మసమాజ్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు ధన్యవాదములు తెలియచేశారు.

22వ దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

-53వ రామాయణ్‌మేళా ఛీఫ్ కన్వీనర్‌గా గోవిందరాథి

బేగంబజార్, సెప్టెంబర్ 15ప్రభాతవార్త: 53వ రామాయణ్‌మేళా చీఫ్‌కన్వీనర్‌గా రాజస్థానీ ప్రగతి సమాజ్ కార్యదర్శి,బిజెపి నాయకులు గోవిందరాథిని నియమించినట్లు రాజస్థానీ ప్రగతి సమాజ్ అధ్యక్షులు కమల్‌నారాయణ్ అగర్వాల్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేటా దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రామాయణ్‌మేళా ఉత్సవాలకు తనపై నమ్మకం ఉంచి చీఫ్ కన్వీనర్‌గా ఎన్నుకోవడం సంతోషదాయకమన్నారు.నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రామాయణ్‌మేళాను ఎంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు.ఈనెల 22వ తేదినుంచి అక్టోబర్ 2వ తేది వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రాజస్థానీ ప్రగతి సమాజ్,ఎగ్జిబిషన్ సొసైటి సంయుక్త ఆద్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఆసరా పింఛన్ దారులకు రూ.6 వేలు పెంచాలి : శ్రీకిషన్ మాదిగ

ఆసరా పింఛన్లు పెంచాలని తిరుమలగిరి తహశీల్దార్ బిక్షపతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేత ఇటుక శ్రీకిషన్ మాదిగ తదితరులు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా పింఛన్ దారులకు పింఛన్లు 6 వేల రూపాయలకు పెంచాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుకు శ్రీ కిషన్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్తాపక అధ్యక్షులు మంద క్రిష్ణ మాదిగ పిలుపు మేరకు విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం తిరుమలగిరి తహశీల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వింతంతు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ఇన్‌ఛార్జిలు శ్రీనివాస్, మంద మధుకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రేఖ మాదిగ, విశ్వనాథ్, బ్యాగరి నర్సింహ్మ, చింటూ, గుండమాల, మక్కల అశోక్,నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను పరామర్శించిన సంతోష్ యాదవ్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఈ నెల 14న ఆదివారం రాత్రి కురిషిన బారీ వర్షానికి లోతట్టు ప్రాంతంలో ఉన్న రైల్ నిలయం అంబేద్కర్ నగర్ వరదనీటి ప్రవాహానికి జలమయమైంది. విషయం తెలుసుకున్న మోండా డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేత సి.సంతోష్ యాదవ్ బస్తీని సందర్శించి సహాయక చర్యలు చేపట్టారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేసిన డిబిఎఫ్

వరద బాధితులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న డిబిఎఫ్ నాయకురాలు పులి కల్పన

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: ఇటీవల కురిషిన బారీ వర్షాలతో నష్టబోయిన వరద బాధితులకు సోమవారం అడ్డగుట్ట,లోహియ నగర్, గాంధీ నగర్, మొండి బండ నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వరద బాధితులకు డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన ఆధ్వర్యంలో వదర బాధితులకు బియ్యం,పప్పు, మంచినూనె వంటి నిత్యవసర సరుకులను అందజేశారు.కార్యక్రమంలో నళిని, శారధ, ఈశ్వర్,బన్నమ్మలు పాల్గొన్నారు.

జలమయమైన రైల్ నిలయం, అంబేద్కర్ నగర్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త: లోతట్టు ప్రాంతంలో ఉన్న రైల్ నిలయం అంబేద్కర్ నగర్ బారీ వర్షానికి జలమయమైంది. విషయం తెలుసుకున్న మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, జిహెచ్‌ఎంసి ఇంజనీర్లతో కలిసి ఆమె పర్యటించి వరదనీరు సాఫీగా పోయే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆదివారం రాత్రి కురిషిన బారీ వర్షానికి నిత్యవసర సరుకులు, దుస్తులు, వంట పాత్రలు వరదనీటిలో కొట్టుకు పోయాయని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో, ఏఈ చంద్రశేఖర్,నాయకులు చిన్న వీరయ్య,కొంతం నరేశ్, జిత్తూ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశ్‌గౌడ్ బిఆర్ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్‌లో ఉన్నారా? స్పష్టం చేయాలి

- మూసీపై కట్టిన ప్రకాశ్‌గౌడ్ ఇంటిని హైడ్రా ఎందుకు కూల్చడం లేదు?
- బిఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి కార్తిక్‌రెడ్డి

నార్సింగిలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న పి.కార్తికిరెడ్డి.

నార్సింగి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ బిఆర్ఎస్‌లో ఉన్నారా? కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా? ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు స్పష్టం చేయాలని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్సింగిలో బిఆర్ఎస్ ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తిక్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ రాజేంద్రనగర్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని, ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైల్ వేయాలని ప్రతిపాదించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తూ, ఈ ప్రాజెక్టును ఫోర్త్‌సిటీకి తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌కు ఇంత అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ఎమ్మెల్యే ఎందుకు మిన్నకుంటున్నారని దుయ్యబట్టారు. మూసీపై వెలుస్తున్న అక్రమ కట్టడాలు సీఎం రేవంత్‌రెడ్డికి, హైడ్రా అధికారులకు కనిపించడం లేదా? జంట జలాశయాలలోకి గోదావరి నీటిని తీసుకువచ్చేందుకు అవసరానికి మించి ప్రజాధనంను వెచ్చించడం వెనుకాల మతలాబేమిటని ప్రశ్నించారు. నిబంధనల పేరుతో నిరుపేదల ఇళ్లు కూలుస్తున్న హైడ్రా అధికారులకు మూసీ నది మధ్యలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిర్మించిన ఇళ్లు కూల్చే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. మూసీ ఎఫ్‌టిఎల్ పొడువు, అడ్డం ఎంతా అని ఆర్‌టిఐ కింద అడిగితే అధికారులు సమాధానం ఇవ్వడం లేదన్నారు. మూసీపై వెలిసిన అక్రమ కట్టడాలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిల వాటాలు ఎంతో స్పష్టం చేయాలన్నారు. పేదోళ్లకు ఓ నీతి పెద్దోళ్లకు మరో నీతా? రాజ్యాంగంలో ఇలాగే ఉందా అని కార్తిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నార్సింగి మున్సిపల్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నిజాముద్దీన్, వర్ధాచారి, మల్లేష్, చిరంజీవి, ఉదయ్, గణేష్, విష్ణు, మహేష్, ఆనంద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వరదలతో చనిపోయిన కుటుంబాలకు రూ.25లక్షలు సాయం అందించాలి : సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ముషీరాబాద్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త: ఆదివారం కురిసిన భారీ వర్షం వల్ల వరదనీరు పొంగిపోయి, ముగ్గురు వ్యక్తులు కొట్టుకుపోవటం విచారకరమని, తక్షణమే ప్రభుత్వం చనిపోయిన వారి కుటుంబాలకు 25లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల, నాలాలలో ప్రజలు కొట్టుకు పోవటం గత 15 సంవత్సరాలుగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు దీనిపై శాశ్వత పరిష్కార దిశగా ఆలోచన చేయకపోవటం విచారకరమన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కిర్లోస్కర్ కమిటీ సూచనలను తుంగలో తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20నెలలు కావస్తున్నా ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోవటం లేదని, ప్రజల ప్రాణాలపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ స్పందించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సమావేశంలో నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, తడక వినోద్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో సేవా పక్షం కార్యక్రమాల సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కన్వీనర్ శ్రీకర్ రావు అధ్యక్షతన ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమాల సన్నహక సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు హాజరై మాట్లాడారు. మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఇచ్చిన వివిధ సేవా కార్యక్రమాలను డివిజన్ వారిగా విజయవంతంగా నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా అన్ని డివిజన్ కేంద్రాల్లో జాతీయ జెండాలు ఎగురవేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని 17 సెప్టెంబర్ నుండి 2 అక్టోబర్ వరకు 15 రోజుల పాటు బిజెపి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న "సేవా పక్షం"లో భాగంగా డివిజన్ల వారిగా మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ చేపట్టడం, రక్తదానం ఒంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సెప్టెంబర్ 21న నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి నమో యువ రన్ 3కె మారథాన్ మాదకద్రవ్య రహిత దేశంగా మార్చాలన్న సంకల్పంతో రన్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి వేడుకలను కూడా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి కుమార్, శంకర్ రెడ్డి, మహేందర్, అభిషేక్ గౌడ్, హరి ప్రసాద్, శివరంజన్, రమేష్, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చదువు చెప్పే విద్యాసంస్థలపై ట్రేడ్ లైసెన్స్ పేరుతో కొరడా

మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసం అని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహ రెడ్డికి కుత్బుల్లాపూర్ మండల ప్రైవేట్ పాఠశాల యజమాన్యలతో కలిసి సురేష్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ హైకోర్టు ఆఫ్ తెలంగాణ, ప్రైవేట్ పాఠశాలలకు, విద్యా సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదని 2022వ సంవత్సరం ఆర్డర్స్ కూడా ఇచ్చిందని ఉపకమీషనర్‌కి తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల మధ్యతరగతి పాఠశాలపై తీవ్రప్రభావం చూపుతుందని, పాఠశాల యాజమాన్యాలు దివాళా తీసే స్థాయికి వస్తాయని అన్నారు. ఈ చర్యను నేను తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి అక్రమ చర్యలను, అక్రమ వసూళ్లను చేయవద్దని, ఇకమీదట ఇలా జరిగితే పాఠశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని చాలా వరకు ఇండ్లకు 100 వంద శాతం పన్ను వేస్తున్నారు. మా డివిజన్ గలవారు కడుపేద వారు వారిపై పన్నుల పేరుతో అధిక భారం వెయ్యవద్దని ప్రజావాణిలో స్థానికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డితో పాటు డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఉన్నారు.

లక్షణరేఖ నిర్మాతకు సత్కారం

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:

ప్రముఖ నిర్మాత లక్షణరేఖ సినిమా 50 సంవత్సరాల పండుగ వేడుకలు సోమవారం సంస్కృతిరత్న, ఇటిక్లా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శతాధిక చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలుగు చిత్ర సీమ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ తెలుగు మూవీ అసోసియేషన్, "ఇట్మా" సంస్థ తరపున ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, సినీనటి జయసుధ, దర్శక నిర్మాత యన్ గోపాలకృష్ణ లను , కె.ధర్మారావు ఘనంగా సత్కరించి అభినందించారు.

బాచుపల్లి ఆకృతి కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్

నిజాంపేట్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

బాచుపల్లి సర్వేనెంబర్ 454 నందు ప్రభుత్వ భూములు 400 గజాలు ఆక్రమించుకొని అప్రోచ్ రోడ్డుగా చూపించుకోవడమే కాకుండా ప్రభుత్వ భూమి బోర్డు తీసివేసి సిమెంట్ రోడ్డు వేసుకోవడంపై తక్షణమే ఆకృతి కన్స్ట్రక్షన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి, రోడ్డును తొలగించి ప్రభుత్వ భూమిని అని బోర్డు పెట్టాలని సోమవారం ఆకుల సతీష్ ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదుకు స్పందించిన అడిషనల్ కలెక్టర్ ఎంఆర్ ఓకి ఫోన్ చేసి చర్యలు తీసుకొని బోర్డు పెట్టాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, శ్రీనివాస్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అలనాటి తీపి గుర్తులు నెమరేసుకొన్న మిత్రులు...

ఆత్మీయ సమ్మేళనం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకొని హాయ్ రవి, హాయ్ ఉమా, హాయ్ మామ, లక్ష్మి మ్మ ఎలా ఉన్నావ్, శ్రీదేవి బాగున్నావా, ఏరా బాబాయ్ ఎట్లున్నావ్, హాలో పావని, ఎలా ఉన్నారు ఫ్రెండ్ అంటూ ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్న మధుర క్షణం కూకట్‌పల్లి పరిధిలోని పిఎన్ఎం హైస్కూల్‌లో చోటు చేసుకుంది. గత 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హోటల్ వైష్ణవి గ్రాండ్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. దాదాపు 27 ఏళ్ల తరువాత విద్యార్థులు అందరూ ఒకే వేదికపై కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా తాము చదివిన పాఠశాలకు వెళ్లి వారి చివరగా కూర్చున్న క్లాస్ రూమ్‌లో బెంచీలపై కూర్చొని ఒక్కసారిగా చిన్నత నంలోకి వెళ్లి తమ మధురానుభూతులను నెమరువేసుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. చిన్నతనంలో చేసిన అల్లరి, చిలిపి పనులు గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఒకరి తరవాత ఒకరు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి వివరించుకొని ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్న పిల్లల్లా సరదాగా కాసేపు గడిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం ఎంత ఎదిగినా ఆనాటి రోజులు ఆ జ్ఞాపకాలు మన నుండి దూరం కావని ఇలాగే అప్పుడప్పుడు కలుసుకొని మంచి చెడులు పంచుకోవాలని, మనం చదివిన పాఠశాల, కళాశాలల అభివృద్ధిలో కొంత భాగస్వామ్యులు కావాలన్నారు.

అభ్యుదయ సాహిత్య యుగ కర్త గురజాడ : దామోదర్ గుప్త

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త:

భావ కవిత్వ యుగ కర్త రాయప్రోలు సుబ్బారావు కాగా అ భ్యుదయ కవిత్వ యుగకర్త గురుజాడ అప్పారావుగా ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి తన పరిశోధనా గ్రంథంలో పేర్కొన్న అంశాన్ని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ గుర్తు చేశారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. నాటి సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థల్ని ప్రతిబింబే విధంగా కన్యాశులకం నాటకం రాసి ప్రజలలో చైతన్యం కలిగించారనీ చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కవి రఘుశ్రీ, గాయనీ మణులు ఎస్ శ్రీదేవి , జి సీత పాల్గొన్నారు.

లక్ష్మి కమలాకర్‌కి జీవిత సాఫల్య పురస్కారం

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆసుపత్రిలో పనిచేస్తున్న లక్ష్మి కమలాకర్‌కి జీవిత సౌపల్య పురస్కారం, కల్పన మంతెనకి సుస్సారూత సేవా రత్న పురస్కారం, శ్రవణ్ రెడ్డికి బెస్ట్ ఫార్మసీ మెయింటెనెన్స్ అవార్డులతో ముగ్గురిని యాక్ట్ నౌ ఫౌండేషన్ సన్మానించింది. గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్ భారత దేశ మొత్తంలో 700 మంది రేఖి థెరపిస్ట్‌లను తయారు చేయడమే కాకుండా 11 మందిని గ్రాండ్ మాస్టర్‌లను తయారు చేసారు. కుటుంబ భాద్యతలని, వృత్తి బాధ్యతలను సమానంగా పోషిస్తున్నారు. వీరిని సత్కరించటం మమ్మల్ని మేము సత్కరించటంగా భావిస్తున్నాం అని నిర్వాహకులు తెలియజేశారు. కల్పనా మంతెన రాందేవ్‌రావ్ హాస్పటల్‌లో గత 15 సంవత్సరాలుగా సమాజానికి అత్యున్నతమైమ సేవల్ని అందిస్తున్నారనీ సమాజంలో అట్టడుగువర్గాలకి అత్యున్నతమైన మెడికల్ వైద్య పరమైన సహాయ సహకారాలని స్కూల్ హెల్త్ ప్రోగ్రాముని నిర్వాటకంగా కొనసాగిస్తున్నారనీ అన్నారు. వీరికి అబ్దుల్ కలం పేరుమీద అవార్డుని ప్రదానం చేయడం జరిగిందన్నారు. నల్ల శ్రవణ్ కుమార్ రెడ్డి గత 18 సంవత్సరాలుగా రాందేవ్ రావ్ ఆసుపత్రిలో అత్యున్నతమైన ఫార్మసీ సేవలు అదించడమే కాకుండా అనేక మందికి అన్నదానం, రక్తదానం, అత్యవసర పరిస్థితిలో ఉన్న రోగులకి సేవచేయడం ద్వారా శ్రవణ్ రెడ్డికి ఈ అవార్డుని ప్రధానం చేయడం ఆక్ట్ నౌ ఆర్గనైజషన్ వారు అత్యంత పురస్కారంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి కమలాకర్ మాట్లాడుతూ తనకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ఇచ్చిన ఆక్ట్ నౌ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కల్పనా మంతెన మాట్లాడుతు ఈ అవార్డు తీసుకోవడం ద్వారా తన భాద్యత మరింత పెరిగిందని రాందేవ్ రావ్ ఆసుపత్రి సేవలను కూకట్‌పల్లి ప్రాంతానికే కాకుండా మిగతా పరిసర ప్రాంతాలకు విస్తరించాలని తెలిపారు. శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ సమాజం పట్ల మరింత భాదతాయూతంగా ప్రవర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కమలాకర్, డాక్టర్ యోబు, సరస్వతి, శోభా, యాక్ట్ నౌ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

గాంధీనగర్ డివిజన్‌లో నాలా పరీవాహక ప్రాంతాల సందర్శన

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 ప్రభాతవార్త: ఎడదెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి నాలాపరీవాహక ప్రాంతాలైన గాంధీ నగర్ డివిజన్ లోని వివిధ ప్రాంతాలను సోమవారం స్థానిక కార్పొరేటర్ సూచనల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్ సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. అశోక్ నగర్ నాలా పరివాహక బస్తీలైన అరుంధతి నగర్,దోభిఘాట్, సబర్మతి నగర్,చిక్కడపల్లి బాపు నగర్ బస్తిలోని ప్రజలు వరద నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న సమాచారంతో బస్తీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్‌తో చర్చించి జిహెచ్‌ఎంసి పారిశ్యద్ధ సిబ్బంది ద్వారా వరద వల్ల పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగింపచేసారు. ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్‌తో మాట్లాడి వారి సిబ్బంది ద్వారా వరద వల్ల నీట మునిగిన బస్తీల్లో నీరు అశోక్ నగర్ నాలాలోకి వెళ్ళేవిధంగా వెంటనే పనులు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, బస్తీల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను వెంటనే కార్పొరేటర్ కార్యాలయం నెంబర్ 77998 19991 కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆనంద్ రావు, సాయి కుమార్,దోభి ఘాట్ బస్తి వాసులు మల్లికార్జున్,అనిల్, నగేష్,జాంఫీర్,లక్ష్మి,వెంకటేష్,నాని పాల్గొన్నారు.

దోభిఘాట్ బస్తి వాసుల సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ సికింద్రాబాద్ పార్లమెం

చేర్యాల తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

చేర్యాల/ధూళిమిట్ట, సెప్టెంబరు 15,ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో విహెచ్ పిఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వోలకు వినతిపత్రాలను అందించారు.అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కి పెన్షన్‌దారులను మోసం చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలని తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

వినతి పత్రం అందిస్తున్న నాయకులు

అక్కన్నపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : వికలాంగులు, వితంతులు, వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు జన్నె రవి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పెన్షన్లు పెంచుతామని హామీతో గద్దెనెక్కిన కాంగ్రెస్ 20 నెలలె గడిచినా ఇప్పటి వరకు ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని విమర్శించారు, పద్మశ్రీ మంద కృష్ణ ఆదేవాల మేరకు నేడు తహసీల్దార్ కార్యాలయం ముట్టడించి డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ నాయకులు, పెన్షనర్లు ఉన్నారు.

చిన్నకోడూరులో...

తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, సెప్టెంబర్ 15,ప్రభాతవార్త : పద్మశ్రీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు పెన్షన్ల పెంపుకు మద్దతూ తెలుపుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి,విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నకోడూరు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లమారి రంగరాజం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు.వికలాంగులకు, గీత, బీడీ, ఒంటరి మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెన్షన్లు పెంచి అందజేయాలన్నారు. పెన్షన్‌దారుల పెన్షన్లు పెంచి ఇవ్వకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గాజుల అనంద్, కొట్టేపల్లి పరశురాములు, గాజుల రవి, ఎర్ర అంజనేయులు, రాజు, పెరిమి అజయ్, మహంకాళి శంకరయ్య, పొన్నాల నరసింహులు, సురేష్‌గౌడ్, మేడోజు శ్రీనివాస్, గంగనవేణి నాంపల్లి, మల్లేశం, రిక్షా మల్లయ్య, అంబదాసు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచడం చేతగాని సిఎం రాజీనామా చేయాలి

ఐఐసి ముందు ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ నాయకులు

గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త): పెన్షన్లు పెంచడం చేతగాని సిఎం వెంటనే రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఉబ్బని ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఐఐసి కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు, వితంతులు, వృద్ధాప్య, ఒంటరి మహిళలు, గీత, బీడి, చేనేత కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించి రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్నికల ముందు పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చి 50 లక్షల పెన్షన్‌దారుల ఓట్లను దండుకొని గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పాత పెన్షన్లను పెంచలేదని, కొత్తగా పెన్షన్లు మంజూరు చేయలేదని ఎద్దేవ చేశారు. పెన్షన్‌దారులకు వెంటనే పెన్షన్లు పెంచకపోతే ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ నాయకులు నల్ల రవి, ఎండి.రహీం, మైస హరికృష్ణ, మైస శ్రీనివాస్, గూడూరు రాజు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సిద్ధిపేట అర్బన్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : సిద్ధిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల ప్రభుత్వ పాఠశాలలో 1976 నుంచి 1982 వరకు చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం 45 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 45 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి వచ్చి అనాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. అనాడు విద్యా బోధనలు అందించిన గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కోటయ్య, రామకృష్ణరెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పొన్నాల అర్జున్‌రెడ్డి, మహేందర్, మల్లికార్జున్, రాజు, శ్రీనివాసరాజు, సురేందర్, ఎమ్‌ఎమ్‌రెడ్డి, సిహెచ్. శ్రీనివాస్, భాగ్యమ్మ,అరుణ, శోభారాణి పాల్గొన్నారు.



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బిటి రోడ్డు వేయండి మహాప్రభో...!

వర్షానికి దెబ్బతిన్న మట్టిరోడ్డు, నరకంగా మారిన ప్రయాణం.. ప్రభుత్వం పట్టించుకోవాలని తండావాసుల వేడుకోలు

ధూళిమిట్ట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త

ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతం. నేడు స్వరాష్ట్రంలో ఒకే జిల్లా లోని మూడు నియోజకవర్గాల సరిహద్దు ప్రాంతంగా ఉన్న తోర్నాల గ్రామం. పరిపాలన సౌకర్యార్థం గత ప్రభుత్వం వరంగల్ జిల్లాలో ఉన్న తోర్నాల గ్రామాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపింది. అలా చేయడమే ఈ గ్రామ ప్రజలకు శాపంగా మారిందనే చెప్పకనే చెప్పచ్చు. కలెక్టర్ కార్యాలయం కోసం సిద్దిపేట జిల్లాకు, ఎమ్మెల్యే కార్యాలయం కోసం జనగామ జిల్లాకు, రెవెన్యూ డివిజన్ కార్యాలయం కోసం హుస్నాబాద్‌కు వెళ్లాల్సి వస్తుంది. అయితే ఈ సరిహద్దు గ్రామానికి సరైన రోడ్డు సదుపాయాలు లేక ఎటు వెళ్లాలన్న ప్రయాణం నరకంగా మారుతుంది. నియోజకవర్గానికి చివరి గ్రామంగా ఉండడంతో మౌలిక వసతులు కల్పించాలని గతంలో ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పటికైనా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ స్పందించి తోర్నాల నుంచి తండాకు వెళ్లేందుకు బీటి రోడ్డును మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తండాకు వెళ్ళే మట్టిరోడ్డు వర్షాలకు పూర్తిగా ధ్వంసమైన దృశ్యం

గ్రామ శివారులో తండావాసులు...

తోర్నాల గ్రామ శివారులోని హనుమతండాలో పదుల సంఖ్యలో గిరిజన (లంబాడి) కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి కనీసం గ్రామ పంచాయతీకి రావడానికి కూడా సరైన రోడ్డు సదుపాయం లేదు. దశాబ్ద కాలంగా వారి బాధలను దిగమింగుకుని జీవనం సాగిస్తున్నారు.

చుట్టుపక్కల ఇతర గ్రామా లకు వెళ్లడానికి సరైన రోడ్డు లేక వాహనాలు వెళ్ల లేక నేటికి కాలినడకన ప్రయాణం సాగిస్తున్నారు. ఆరోగ్యం బాగాలేక ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వారు అనుభవించిన బాధలు వర్ణనా తీతం. వాళ్ల అవసరాల నిమిత్తం చుట్టు పక్కలగల రామవరం, పోతారం(జె), తోర్నాల గ్రామాలకు రాక పోకలు సాగిస్తుంటారు. కాని ఇప్పటికీ సరైన రోడ్డు లేక తండావాసులు నరకం అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ తండాలోకి వెళ్లేందుకు బీటి రోడ్డు మంజూరుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఈ దారి వెంబడి వెళ్ళాలంటే నరమే.

జాటోతు దుర్గయ్య, తండావాసి

ధూళిమిట్ట మండలం తోర్నాల శివారులోని హనుమతండాకు వెళ్లాలంటే ప్రయాణం నరకంగా ఉంటుందని, ఏదైన అపాయం వచ్చి ఆసుపత్రికి వెళ్లాలంటే ఈ మార్గం నుంచి వెళ్లలేకపోతునామని, జిల్లా అధికారులు స్పందించి మా తండాకు బీటి రోడ్డు వేయాలని కోరుతున్నాను.

యూరియా బస్తాల కోసం లైన్‌లో నిలబడ్డ రైతులు

చౌటకూరులో యూరియా కోసం ఎగబడిన రైతులు

చౌటకూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: యూరియా బస్తాలు పొందేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. చౌటకూరుకు సోమవారం డిసిఎంఎస్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రానికి 540 బస్తాల యూరియా పంపిణీని పురస్కరించుకుని రైతులు తెల్లవారు జామునే ఎరువుల దుకాణం ముందు బారులు తీరారు. యూరియా ఎరువును అందుకునేందుకు చౌటకూరు మండల రైతులతో పాటు ఇతర మండలాల రైతులు చేరుకోవడంతో ఎరువుల దుకాణం కిక్కిరిపోయింది. రైతులు క్యూలైన్లో నిలిచాక దుకాణం నిర్వాహకులు రైతులకు యూరియాను అందచేశారు.

దౌల్తాబాద్‌లో...

దౌల్తాబాద్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): యూరియా కోసం రైతుల కష్టాలు అంతా ఇంతా కావు. వేకువజాము నుండే అర్ధరాత్రి వరకు యూరియా కోసం రైతులు, మహిళా రైతులు పస్తులు ఉంటూ పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. దౌల్తాబాద్‌లో సోమవారం ఉదయం యూరియా కోసం వేకువజాము నుండే క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. మండలంలో రైతులు యూరియాకోసం పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం రైతులకు యూరియాను అందించడంలో విఫలమయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

పిసిసి చీఫ్‌ని కలిసిన డిసిసి అధ్యక్షుడు

నర్సాపూర్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : టిపిసిసి అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు(డిసిసి) ఆంజనేయులు గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అన్ని కమిటీలను ప్రకటించబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. నీ మీదకు త్వరలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని ఎన్నికల్లో కష్టపడిన కాంగ్రెస్ నాయకుల గెలిపించాలన్నారు స్థానిక ఎన్నికల్లో కష్టపడి పని చేసే వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజలందరికీ అండగా నిలుస్తుందని అన్నారు దీంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసం ఏర్పడిందని రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈ మేరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పనిచేసే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం చేకూర్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కలిసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజలకు అండగా నిలబడేది సిపిఐ పార్టీయే

బెజ్జంకి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే పార్టీ కేవలం సీపీఐ పార్టీయేని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి బోనగిరి రూపేష్‌లు అన్నారు. తెలంగాణ రైతాంగం సాయుధ పోరాట 77వ వారోత్సవాలో భాగంగా 17 వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం బానిసత్వం వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తెలంగాణలో సాయుధ పోరాటం చేసింది కమ్యూనిస్టులేని తెలిపారు. రామచంద్రారెడ్డి గుండాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాటం చాలా గొప్పది అన్నారు. దొడ్డి కొమరయ్య మరణంతో సాహిద పోరాటానికి బీజం పడ్డిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఏఐవైఎఫ్ నాయకులు సంగెం మధు,దొంతర వేణి, కల్లూరి బాలమల్లు, పొట్లపల్లి బాబు మహేష్, రోడ్డ చరణ్, కుంభం రాములు, పులి రమేష్, కనగండ్ల చంద్రయ్య, తాడిచెట్టు ప్రభాకర్, దర్శనాల మహేందర్, కరేవుల నరస్యయ్య, నిషాని శివకృష్ణ, కుంట లక్ష్మణన పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మిత్రునికి ఆర్థిక సహాయం

వర్గల్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): మండలకేంద్రమైన వర్గల్‌కు చెందిన కాషా కుబేరచారికి ఇటీవల తీవ్రమైన బ్రెయిన్ ఆరోగ్య సమస్య ఎదురవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. కుబేరచారికి ఆపరేషన్ చేయాలని, ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న కుబేరచారి మిత్రులు సోమవారం అతని కుటుంబసభ్యులను కలిసి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయస్సులో తీవ్రమైన ఆరోగ్య సమస్యను ఎదుర్కొంటున్న తమ మిత్రునికి ఆపరేషన్‌కు దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి 9949701431 కాషా ఏగొండచారి నెంబర్‌కు ఫోన్‌పే, గూగులోపే చేయగలరని కోరారు.

ప్రవేశ ఎంపిక పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

వర్గల్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): జవహర్ నవోదయ విద్యాలయ 2026-27 విద్యాసంవత్సరం 9, 11 తరగతులలో ఖాళీగా వున్న సీట్లలో ప్రవేశానికి అర్హులైనఅభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వ తేదీ చివరి తేదీ అని, ఉమ్మడి మెదక్‌జిల్లాలోని విద్యార్థినీ, విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులని తెలిపారు. రెండు తరగతులకు ప్రవేశపరీక్ష 2026 ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు.

మండల స్థాయి కార్యశాల కార్యక్రమం

వర్గల్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): మండలంలో సేవా పక్షం 2025 మండల స్థాయి కార్యశాల కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ బిజెపి, ఎంపి రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, ఉపాధ్యక్షుడు దిండి నాగరాజు, కార్యదర్శి కుమ్మరి రమేష్,బూత్ అధ్యక్షుడు బబ్బూరి వెంకట్, నూక బద్రి, మణికాంత్, నర్ర రవి, బొప్పిడి సుధాకర్‌రెడ్డి, కాయిత రాజు, బాలుగౌడ్, రేణుదాస్, చిలువేరి శ్రీపతి, బర్కం రాజు, శ్రీనివాస్, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు, నాయకులు టేకులపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పవన్, నింగ మధు, శ్రీరాం మల్లేష్, ద్యాగ శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రమశిక్షణ ముఖ్యం : సిఐ

గజ్వేల్, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త): విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా ముఖ్యమంత్రి గజ్వేల్ సిఐ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మహిళల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, షీటీమ్ ప్రాముఖ్యత గురించి, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు కృషి, పట్టుదల, ముందుచూపు చాలా ముఖ్యమన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థినిలను ఎవరైనా వేధిస్తే డయల్ 100కు లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిష్టారెడ్డి, ఉపాధ్యాయులు, గజ్వేల్ షీటీమ్ బృందం హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రామచంద్రారెడ్డి, మహేష్, మహిళా కానిస్టేబుల్ శ్యామల, గజ్వేల్ కానిస్టేబుళ్లు అరవింద్, సుధాకర్, అన్వేష్, మహిళా కానిస్టేబుల్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి : సిఐ

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త : విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండడంతో పాటు వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిఐ కోండ్ర శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తుకు అలవాటు పడి వారి జీవితాలు పాడు చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాలకు, సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నాలన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికల అభద్రతా భావానికి లోనవవద్దని, ఎలాంటి సమస్య వచ్చినా ఎదిరించి నిలుబడాలన్నారు. తనతో కాదు అనుకున్నప్పుడు 112, 8712667434 నంబర్‌లకు సంప్రదించవచ్చన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారికి స్పందించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, షీటీమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుల్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రం చేసిన విద్యార్థులు

మర్కుక్, సెప్టెంబరు 15 (ప్రభాతవార్త): మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో విద్యార్థులు పరిసరాలలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. హైద్రాబాద్‌లోని బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గత మూడు రోజులుగా ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలోని పలు వీధులగుండా తిరుగుతూ ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తూ గార్బేజ్ కవర్లలో వేశారు. వారి వెంట సమన్వయకర్త డాక్టర్ సరిత, డాక్టర్ ప్రసన్న, కార్యదర్శి వికాస్‌రెడ్డి, నాయకులు బిక్షపతి, కృష్ణ, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎబివిపి జిల్లా హాస్టల్స్ కన్వీనర్‌గా రాజేష్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట జిల్లా హాస్టల్స్ కన్వినర్‌గా హుస్నాబాద్ పట్టణానికి చెందిన చెన్నూరి రాజేష్ ఎంపికైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం రోజున సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎబివిపి మెదక్ విభాగ్ అభ్యాసవర్గలో రాజేష్‌ను కన్వినర్‌గా ఎన్నుకున్నట్లు వివరించారు. రాజేష్ ఎబివిపి హుస్నాబాద్ పట్టణ, నగర ఉపాధ్యక్షులుగా గత రెండెళ్లుగా నిర్వహించిన తన బాధ్యతలను గుర్తించిన సంఘం తనకు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. నూతన జిల్లా హాస్టల్ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌ను సంఘం మండల నాయకులు సోమవారం రోజున కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కర్ర శ్రీహరి మృతి పార్టీకి తీరని లోటు

బెజ్జంకి, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కర్ర శ్రీహరి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కర్ర శ్రీహరి రెండు రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మండల పార్టీ నాయకులు పాకాల మహిపాల్‌రెడ్డి, దుంబాల మహేందర్‌రెడ్డి, ఎల శేఖర్‌బాబు, గోపాల్‌రెడినడ, గంప వెంకన్న, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదం

ఆర్చ్ ఫార్మా యూనియన్ గౌరవాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

సిద్ధిపేట అర్బన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : మండల పరిధిలోని మిట్టపల్లి ఆర్చ్ ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీలో మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదం యాజమాన్య పర్యవేక్షణ లోపమే అని బిఆర్‌టియు ఆర్చ్ ఫార్మా యూనియన్ గౌరవాధ్యక్షులు మారెడ్డి రవీందర్‌రెడ్డి అన్నారు.ఆర్చ్ ఫార్మాను సందర్శించి ప్రమాద విషయాలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ప్రమాద విషయం మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దసరా తర్వాత ఎమ్మెల్యే హరీష్‌రావును ఫ్యాక్టరీకి తీసుకవచ్చి కార్మికుల సమస్యలు తెలుసుకోని పరిష్కరించడానికి మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడొద్దు

బిఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జీ రవీందర్‌గౌడ్

మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : విద్యార్థులకు ఐదేళ్లుగా పెండింగ్‌లోఉన్న ఫీజ్ రియబర్స్‌మెంట్ ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ విద్యార్థులకు రావాల్సిన 6వేల కోట్లు పెండింగ్‌లో పెడితే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యార్థులకు రావాల్సిన రియంబర్స్‌మెంట్ క్లియర్ చేస్తామని హామీ ఇచ్చిన అధికారంలోకి వచ్చి రెండేళ్లు దగ్గర పడుతున్నా పాత బకాయిలు ఇవ్వకపోగా అదనంగా మరో 2వేల 500ల కోట్ల బకాయిలు తయారు చేసి వారిని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రియంబర్స్ మెంట్ రాక ప్రయివేట్ కళాశాలలు అప్పులు తీసుకొచ్చి చేసిన అప్పులు తీర్చ లేక విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు రావాల్సిన రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్, ఎనగందుల శంకర్, రాజు, నియోజకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజుతో పాటు తదితరులు ఉన్నార

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్

మనూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఏ ఒక్కరు సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు చేసుకోలేదని డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రజావాణి ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటివరకు ఒకే ఒక దరఖాస్తులు వచ్చిందన్నారు. ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకుంటే సమస్యలను పరిష్కరిస్తామని, ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్‌కుమార్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్, ఉపాధి ఏపిఓ షాహెద్, మండల విద్యాధికారి శెట్కార్ రాజశేఖర్, అనిల్, కిరణ్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

సిర్గాపూర్‌లో ప్రజావాణిలలో పాల్గొన్న అధికారులు

సిర్గాపూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: ప్రతి సోమవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రెవిన్యూ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ హేమంత్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, ఎస్ఐ నారాయణ, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, పశువైద్యాధికారి జెస్సి క్రాంతి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుజాత, ఇరిగేషన్ ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

నాగల్‌గిద్దలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: మండలపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల్లో ఉపాధి హామి పథకంలో చేపట్టిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో 5 కోట్ల 65లక్షల 47వేల నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులపై మస్టర్ రోల్, రికార్డులను అధికారులు పరిశీలించారు. పలు గ్రామాల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు అధికారులుగుర్తించారు. దుర్వినియోగం అయిన నిధులను రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనపు పీడి బాలరాజ్, ఏపిడి రాజు,ఏఈఓ నాగేష్, సోషల్ అడిట్, పంచాయితీ అధికారులు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు రవీందర్‌కు సన్మానం

చౌటకూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండల పరిధిలోని చక్రియాల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను అంబేద్కర్ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని అంబేద్కర్ సంఘం నాయకులు తలారి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ ఉప్పరి దేవదాస్, అంబేద్కర్ సంఘం నాయకులు చిటుకుల శ్రీనివాస్, మంగ రోహిత్, రాజు, కొత్తొల్ల రాజ్‌కుమార్, ఉప్పరి సుధాంశ్, చింతకుంట మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, పింఛన్‌దారులు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పెంచుతామన్న పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దివ్యాంగులకు 4000 నుండి 6 వేలకు పెన్షన్, వృద్ధులకు 2000 నుండి 4 వేలకు, ఆసరా పెన్షన్ 2000 నుండి 4 వేలకు, బీడీ కార్మికులకు 2 వేల నుండి 4 వేలకు పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చి తప్పవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సావల జగన్ మాదిగ, మండల ఇంచార్జ్ లక్ష్మణ్‌మాదిగ, స్వామి రాదిగ, కౌడిపల్లి మండల ఇంచార్జ్ బాలయ్య మాదిగ, ఆశన్నోళ్ల దుర్గాదాస్‌మాదిగ, చిలిపిచేడు మండల ఇంచార్జ్ ఎమ్మార్పీఎస్ వికలాంగులు వృద్ధులు పాల్గొన్నారు.

యాత్రదానం పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రాపురం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: పేదలకు, అనాధలకు, నిరాశ్రయుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన యాత్రదానం పోస్టర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసి కల్పించిన సౌకర్యాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలోని వివిధ అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, నిరాశ్రయులలను పుణ్యక్షేత్రాలకు సొంత నిధులతో పంపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. యాత్రదానంకు కార్పోరేట్ సంస్థలు, దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బిహెచ్‌ఈఎల్ డిపో మేనేజర్ సుధా, ఆర్టీసి సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రదానం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

రామచంద్రాపురంలో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందచేస్తున్న ప్రవీణ్‌కుమార్

పెన్షన్‌లు పెంచండి.. హామీలను అమలు చేయండి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

రామచంద్రాపురం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామి మేరకు అర్హులైనవారికి పెన్షన్‌లను పెంచాలని డిమాండ్‌చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రమోద్ మాట్లాడుతూ వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, కండరాల క్షీణత వ్యాధిగ్రస్థులకు 4 వేల రూపాయల పెన్షన్ అందిస్తామని హామీచేసి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా పెన్షన్‌ను పెంచకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుపచ్చేలా దఫాలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తా రోకోలు లాంటి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం నాయకులు తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డికి వినతి పత్రం అందచేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట...

పుల్‌కల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: వికలాంగుల చేయుత పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతి నిధి నల్లోల ప్రవీణ్‌కుమార్‌మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వికలాంగుల చేయుత పెన్షన్లు పెంచాలని కార్యాలయాన్ని ముట్టడించినట్లు పేర్కొన్నారు. వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ. 2 వేలు, కండరాల క్షీణతతో అవస్థలు పడుతున్న బాధితులకు రూ.15 వేలు పెన్షన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విహెచ్ పిఎస్ రామ్‌చందర్, లక్ష్మణ్, యాదుల్ల, బాలరాజ్ మాదిగ, రమేష్ మాదిగ, కృపారామ్, జంగం శంకర్, సుంగ నరేష్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

నారాయణఖేడ్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : పట్టణంలోని విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలలో కరస్పాండెంట్ జి.సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ దేశ జాతీయ భాషగా ఉన్న ప్రాధాన్యం, ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవలసిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతపై ప్రసంగాలు, వ్యాసరచనలు, కవితా పఠనాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ ఆకారంలో విద్యార్థులు..

హింది ఆకారంలో విధ్యార్థులు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త : ప్రపంచ హిందీ భాష దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న హిందీ దివస్ పేరిట జాతీయ హిందీ భాషా దినోత్సవ పురస్కరించుకొని సోమవారం నారాయణఖేడ్ తాలూకాలోని బోధి పాఠశాలలో విద్యార్థులు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఇందులో పిల్లలు హిందీ అనే అక్షరాలతో కూర్చొని వినూత్నంగా అబ్బురపరిచే విధంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, సిబ్బంది విజయకుమార్, లక్ష్మణ్ సాగర్ హిందీ పండితులు ప్రకాష్, ఇక్బాల్ మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులపై మరింత బాధ్యత

చిన్నశంకరంపేట,సెప్టెంబరు 15,ప్రభాతవార్త: ఉత్తమ ఉపాధ్యాయులపై మరింత బాధ్యత పెరింగిందని మండల తహసీల్దార్ మాలతి, మండల విద్యాధికారి మాలతి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నశంకరంపేట మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 5 గురు జిల్లా స్థాయి,14 మంది మండల స్థాయి ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు జిల్లా అధికారుల చేతుల మిదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉత్తమ ఉపాధ్యాయులను తహసీల్దార్ మాలతి, విద్యాధికారి పుష్పవేణి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షనీయమన్నారు. విద్యార్థులపై దృష్టి సారించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్ది రానున్న రోజుల్లో మరెన్నో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయల్ 100 సేవలు వినియోగించుకోవాలి

-గజ్వేల్ సిఐ రవికుమార్

గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త): ఆపద మరియు అత్యవసర సమయంలో డయల్ 100 సేవలు వినియోగించుకోవాలని గజ్వేల్ సిఐ రవికుమార్ తెలిపారు. హైద్రాబాద్‌కు చెందిన రాకేష్ అనే వ్యక్తి కాంటినెంట్ హోటల్‌లో తన లాప్‌టాప్‌ను మరిచిపోయి కొంత దూరం వెళ్ళగా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించినట్లు సిఐ తెలిపారు. వెంటనే స్పందించిన గజ్వేల్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది నవీన్, రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్‌రెడ్డిలు హోటల్‌కు చేరుకొని లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. బాధితుడు రాకేష్ పోలీస్‌స్టేషన్‌కు రాగా అతని లాప్‌టాప్‌ను తిరిగి అతనికి అందజేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. హోటల్‌లో మరిచిపోయిన విలువైన లాప్‌టాప్‌ను వెంటనే స్పందించి తనకు అందించినందుకు గజ్వేల్ పోలీసులకు బాధితుడు రాకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఏఐఐఈయు బిహెచ్‌ఈఎల్ శాఖ నూతన కార్యవర్గం దృశ్యం

ఎఐఐఈయు బిహెచ్‌ఈఎల్ శాఖ నూతన కార్యవర్గం

రామచంద్రాపురం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆల్ ఇండియ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ బిహెచ్ ఈఎల్ శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియర్ అధ్యక్షురాలిగా బి.శ్రీవాణి, ఉపాధ్యక్షురాలిగా కేఆర్‌కే శ్రీవల్లి, ప్రధాన కార్యదర్శిగా గీత రాజస్వామినాతాన్, సంయుక్త కార్యదర్శి గా విఆర్ రాజేశ్వరి, అదనపుకార్యదర్శిగా ఫిర్దోస్ ఫాతిమా, కోశాధికారిగా ఎంఎన్ పద్మజ నారాయణ్, మహిళా సంఘం కన్వీనర్‌గా గీత రత్నకేశ్వరి, డివిజన్ కౌన్సిల్ సభ్యులుగా కే జగదీశ్‌సింగ్, కార్యవర్గ సభ్యులుగా ఉమ సుబ్రమణ్యం, ఎం జయప్రద, వివిఎన్ మూర్తి, జే ఇందిరా, వై శ్రీదేవి, ఎస్ఎం శుబాన్గిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటి బాధ్యులను బ్రాంచ్ మేనేజర్ పి వెంకట సుబ్బయ్య, క్లాస్-1 అధికారులు, డెవలప్ మెంట్ అధికారుల సంఘం నాయకులు, ఏజంట్ల సంఘం ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి కమిటి బాధ్యులతో కలిసి పాటుపడతానని అధ్యక్షురాలు శ్రీవాని భరోసా కల్పించారు.

హామీలను అమలు చేయాలి

తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందిస్తున్న వికలాంగులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: ఎన్నికల సందర్భంగా వికలాంగులకు ఇచ్చిన హామిలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వికలాంగుల సంఘం మండలాధ్యక్షుడు రెడ్డి గోపాల్ ఆరోపించారు. వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిన్నశంకరంపేట మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై రస్తారోకో చేపట్టారు. వికలాంగులకు రూ4వేల నుండి రూ.6వేలు, వితంతు పెన్షన్ 4వేల రుపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందించారు. వికలాంగులకు మద్దతుగా బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం ఉపాధ్యక్షులు రాజు, రమేష్, శంకర్, కృష్ణ, దత్తు, నర్సింలు, మంజూల, వివిధ గ్రామాల వితంతులు, వికలాంగులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన సమస్య పరిష్కరించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 15,ప్రభాతవార్త: వర్షాకాలం వచ్చిందంటే నీరు చేరి రైల్వే వంతేనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మిర్జాపల్లి గ్రామస్తులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం మండల పరిధి మిర్జాపల్లి గ్రామంలో రైల్వే, రేవేన్యూ సర్వేయర్‌లు విష్ణుదేవ్,దుర్గాభవానికిలు మెద్చల్ నుండి కామారెడ్డి వరకు నిర్మించే డబుల్ డబ్లింగ్‌కు భూ సేకరణ పనులను పరిశీలిస్తుండగా గ్రామస్తులు వెళ్లి రైల్వే అధికారులతో మాట్లాడారు. వంతెన వద్దకు వచ్చి సమస్యకు పరిష్కారం చూడాలని వారు లెలుపగా రైల్వే అధికారుల వంతెన కింద నిలిచిన నిటిని పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తిసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. రైల్వే వంతేన సమస్యను పరిష్కరించిన తరువాతే డబుల్ డబ్లింగ్ పనులు ప్రారంభించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

రైల్వే,మండల సర్వేయర్‌లతో మాట్లాడుతున్న మిర్జాపల్లి గ్రామస్తులు

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలి

ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి

నారాయణఖేడ్, సెప్టెంబరు 15 ప్రభాతవార్త : మిషన్‌భగీరథ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఒకే నియోజకవర్గంలో ఒకే మండలంలో వేరువేరు వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు వేతనాలు పెంచకపోతే సమ్మెకు సిద్ధమని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. నాగలిగిద్ద మండలంలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచడంలో అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కనిపిస్తుంది అన్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కనీసం వేతనాలు పెంచే పరిస్థితి లేదన్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకటే సంస్థలో వేరే కంపెనీ వాళ్ళు 12000 రూపాయలు చెల్లిస్తుంటే వీరు 9000 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారు ఒకవేళ అధికారులు స్పందించకపోతే రానున్న కాలంలో సమ్మె చేయడానికి సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మిషన్ భగీరథ కార్మికులు నగేష్ శివరాజ్ అశోక్ కాశీనాథ్ శంకరప్ప మల్లికార్జున్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎఐటియుసి నాయకులు

వీధి దీపాలు కొరకు ప్రజావాణిలో ధరఖాస్తు చేస్తున్న గ్రామస్థులు

వీధి దీపాలకు ప్రజావాణిలో దరఖాస్తు

చౌటకూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: మండల కేంద్రంతో పాటు పలు గామాల్లో రాత్రిళ్లు వీధి దీపాలు వెలగడం లేదంటూ, సమస్యను పరిష్కరించాలని సోమవారం చౌటకూరులోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు ధరఖాస్తు చేశారు. గ్రామాల్లో రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగక పోవడంతో ఆరుబటకు వచ్చేందుకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు జంకుతున్నారంటే ప్రజలు ధరఖాస్తులో పేర్కొన్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని ప్రతి విద్యుత్ స్థంబానికి వీధి దీపం ఉండేలా చూడాలని ధరఖాస్తులో పేర్కొన్నారు.

ఆకస్మిక విద్యుత్ కోతతో తప్పని ఇబ్బందులు

జహీరాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: పట్టణంలోని ఆదర్శ్‌నగర్‌లో సోమవారం విద్యుత్ అధికారులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ మరమ్మత్తులు పేరుతో ఆకస్మికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడకతప్పలేదు. విద్యుత్ సరఫరా ఆపాల్సి వస్తే ముందస్తుగా ప్రజలకు సమాచారం అందించాల్సి ఉండగా విద్యుత్ అధికారులు అవేమి పట్టించుకోకుండా విద్యుత్ సరఫరా ఆపేయడం ఏమిటని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని వసంత్ విహార్ కాలనలో సోమవారం ఇంటి యజమాని నూతనంగా ఇంటి స్లాబ్ వేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో నీరు రాకపోవడంతో ఇంటి యజమాని ఆటోలో ఫిల్టర్ వాటర్ బాటిల్ తీసుకువచ్చి స్లాబ్‌ను పూర్తి చేసుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

బిఆర్ఎస్‌లో చేరింది కాంగ్రెస్ సర్పంచ్ కాదు

కాంగ్రెస్ నాయకులు

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిర్గాపూర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీలో చేరిన మండలపరిధిలోని కడపల్ మాజీ సర్పంచ్ బాసిరెడ్డిగారి సంజీవరెడి, మాజీ సొసైటీ చైర్మన్ గాల్‌రెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, గాల్‌రెడ్డిగారి కిష్టారెడ్డి బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బిఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి చెప్పిన మార్గంలో పయనిస్తున్న వారికి బిఆర్ఎస్ కండువాలు కప్పి కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లో చేరారని పత్రికలకు ఎక్కడం తగదని కడపల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్ హనుమంతు హెచ్చరించారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అమ్ముడుపోయి ఎన్నికలు ముగిసాక బిఆర్ఎస్ పార్టీలోకే పోవడం జరిగిందని గుర్తుచేశారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆడుతున్న రాజకీయ నాటకమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, బేతయ్య, రాంరెడ్డి, ఆనంద్‌కుమార్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆపరేటర్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే

-మండల పరిషత్‌లో నివాళులర్పించిన అధికారులు

ఝరాసంగం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: సూర్యపేట జిల్లా తుంగతుర్తి మండలంలో 12 సంవత్సరాలుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఆదివారం ఆత్మహత్య చేసుకున్న కంప్యూటర్ ఆపరేటర్‌ది ప్రభుత్వ హత్యే అని అధికారులు అన్నారు. సోమవారం ఝరాసంగంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మహత్య చేసుకున్న ఆపరేటర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ అధికారులు మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా ఊడిగం చేస్తున్నా ప్రభుత్వాలకు తమపై కనికరం రావడంలేదని తమకు ఉద్యోగ భద్రత కల్పించడంలో విషలం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారుల్లాగా విధులు నిర్వహిస్తున్నా ఏ ఒక్క సౌకర్యం అందుకోలేకపోతున్నామని విచారం వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడం, లేదా విధుల నుంచి తొలగించాలని హితువు పలికారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మంజుల, ఉపాధి ఏపిఓ రాజ్‌కుమార్, జూనియన్ అసిస్టెంట్ విజ్ఞాన్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకు నివాళులర్పించిన ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులు, కార్మిక హక్కుల పోరాట యోధుడు జీ ఎల్లయ్య మృతి కార్మిక లోకానికి తీరని లోటని బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి అన్నారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నిర్వహించిన ఎల్లయ్య సంతాపసభలో ఆదర్శ్ రెడ్డి పాల్గొని ఆయనచేసిన సేవలను కొనియాడారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రామాయంపేట పిఎసిఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా మహమ్మద్ ఫయాజుద్దీన్

రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :

నూతన ఇంచార్జి చైర్మన్‌కు పుష్పగుచ్చంతో స్వాగతం పలుకుతున్న సీఈవో నర్సింలు

రామాయంపేట వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఇంచార్జి చైర్మన్‌గా మహమ్మద్ ఫయాజుద్దీన్ సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. గత పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం అల్లాదుర్గం క్లస్టర్ ఆఫీసర్ మహమ్మద్ ఫయాజుద్దీన్‌ను ప్రత్యేక అధికారిగా నియమించగా, ఆయన నేడు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పీఏసీఎస్ సీఈఓ పుట్టి నర్సింలు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు.

కరణం పరిణితను కలిసిన బిజెపి నాయకులు

చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త: బిజెపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కరుణం పరిణితను ఆ పార్టీ జిల్లా కిసాన్ మోర్చా మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డి సోమవారం భాగ్యనగరంలోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయలని ఆమె తెలిపినట్లు మల్లారెడ్డి తెలిపారు. కరుణం పరిణిత బిజెపి కార్యకర్తగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఇంచార్జిగా పని చేశారని, ఇప్పుడు రాష్ట్రకార్యదర్శి అయ్యారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లం పాల్గొన్నారు.

బిజెపి నాయకురాలు పరిణీతను కలిసిన బిజెపి నాయకులు